# ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలి

- మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి
- పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవు
- కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలి
- స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ రాష్ట్ర ప్రత్యేక అధికారి హరిత, కలెక్టర్ సత్యశారద


గీసుగొండ: మొక్కకు నీళ్లు పోస్తున్న ప్రత్యేకాధికారి హరిత, కలెక్టర్ సత్య శారద

గీసుగొండ, ఆగస్టు 8: ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ రాష్ట్ర ప్రత్యేక అధికారి ముండ్రాతి హరిత, కలెక్టర్ సత్య శారదాదేవి అన్నారు. మండలకేంద్రంతోపాటు మచ్చాపురంలో గురువారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని గ్రామ పంచాయతీ కార్యాలయం, జడ్పీహెచ్ఎస్ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం విద్యార్థులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులతో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధులు దరిచేరవన్నారు. ఇండ్లలో ఉండే చెత్తను రోడ్లపై వేయొద్దని, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీలో మాత్రమే వేయాలని కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా జీపీ మల్టీపర్పస్ వర్కర్లకు అందించాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇండ్ల చుట్టూ మురుగునీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, మండల ప్రత్యేక అధికారి సురేశ్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, ఏపీవో చంద్రకాంత్, కార్యదర్శి నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

నెక్కొండ/కరీమాబాద్/నల్లబెల్లి/ఖిలావరంగల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి, జేడీఏ ఉషాదయాళ్ విద్యార్థులకు సూచించారు. నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట జడ్పీహెచ్ఎస్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు చైతన్యవంతం అయినప్పుడే తమ ను తాము రక్షించుకోవడంతోపాటు ఇరుగుపొరుగు వారికి సహాయపడుతారని చెప్పారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామ ఇన్‌చార్జి పర్సన్ రాజ్‌కుమార్, కార్యదర్శి నరేశ్‌కుమార్, హెచ్‌ఎంలు రవీందర్, సుధాకర్, ఉపాధ్యాయులు శ్రవణ్‌కుమార్, రవీంద్రనాథ్ పాల్గొన్నారు. కరీమాబాద్‌లో కార్పొరేటర్లు పల్లం పద్మ, పోశాల పద్మ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నల్లబెల్లి మండలం రేలకుంటలో ఎస్సై ప్రశాంత్‌బాబు ప్రజలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పరిశుభ్రతపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యదర్శి సరస్వతి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు. ఖిలావరంగల్‌లో 4వ రోజు సీజనల్ వ్యాధులపై ప్రజాప్రతినిధులు స్థానికులకు అవగాహన కల్పించారు. స్కూళ్లు, ప్రాథమిక అర్బన్ హెల్త్ సెంటర్లు, పార్కుల వద్ద పారిశుధ్య పనులు చేపట్టి చెత్తాచెదారం తొలగించారు. 34వ డివిజన్‌లో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, 35వ డివిజన్‌లో కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, 37వ డివిజన్‌లో కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, 38వ డివిజన్‌లో బీ ఉమ ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. నాయకులు బి.సురేశ్, చందర్, రాజు, అర్సం రాంబాబు, దూడయ్య పాల్గొన్నారు.

**అందరూ మొక్కలు నాటాలి**

ఖానాపురం/చెన్నారావుపేట/పోచమ్మమైదాన్/వరంగల్ చౌరస్తా: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని దుగ్గొండి సీఐ రాజగోపాల్ పిలుపునిచ్చారు. ఖానాపురం మండలం బుధరావుపేట మోడల్‌స్కూల్ ఆవరణలో ఎస్సై రఘుపతితో కలిసి సీఐ 350 పండ్ల మొక్కలు నాటారు. ఎంపీడీవో భారతి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సధాకర్‌రెడ్డి, ఎంపీవో సునీల్ పాల్గొన్నారు. ఖానాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టేకులతండా, సబ్‌సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారిపేటలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి జ్యోతి, సబ్ సెంటర్ వైద్యురాలు రుచిత సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెన్నారావుపేట కేజీబీవీ ఆవరణలో అధికారులు మొక్కలు నాటి, శుభ్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మండల ప్రత్యేక అధికారి డాక్టర్ బాలాజీ, తహసీల్దార్ ఫణికుమార్, ఎస్సై అరుణ్‌కుమార్, హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే, డాక్టర్ బాలాజీ కోనాపురంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో శ్రీధర్‌రాజు, కార్యదర్శి రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వరంగల్ 13వ డివిజన్‌లో కార్పొరేటర్ సురేశ్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ధరంసింగ్, జవాన్లు రాజు, వినయ్, ఆర్పీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. వరంగల్ 27వ డివిజన్‌లోని అబ్బనికుంటలో కార్పొరేటర్ సీహెచ్.అనిల్‌కుమార్ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు.


అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ పల్లం పద్మ


పోచమ్మమైదాన్: అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ సురేశ్‌కుమార్‌జోషి

**స్వచ్ఛదనం- పచ్చదనం ప్రతిజ్ఞ**

పర్వతగిరి: మండలంలోని జమాల్‌పురం, సోమారం, గుంటూరుపల్లిలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో శంకర్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో సుశీల్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సాంబయ్య, ఈసీ రాజు, డాక్టర్ రమ, సీసీ రవీందర్ రాజు, కార్యదర్శులు శ్వేత, మమత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి బి.సంజీవరెడ్డి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రఘు, మాధవుడు తదితరులు పాల్గొన్నారు.


చెన్నారావుపేట: కేజీబీవీలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


నెక్కొండ: మాట్లాడుతున్న జేడీఏ ఉషాదయాళ్


ఖానాపురం: కార్యక్రమంలో పాల్గొన్న సీఐ రాజగోపాల్

## 'న్యాయవాదులపై దాడులు తగవు'

నర్సంపేట, ఆగస్టు 8: కేసు విషయంలో జనగామ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాదులు అమృతరావు, కవిత దంపతులపై పోలీసుల దాడిని నిరసిస్తూ నర్సంపేటలో న్యాయవాదులు గురువారం కోర్టు విధులు బహిష్కరించారు. రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు రెండు రోజులపాటు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. రెడ్ రిబ్బన్ ధరించిన న్యాయవాదులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి, సీనియర్ న్యాయవాదులు అంబటి శ్రీనివాస్, తండ సారంగపాణి, తొగరు నర్సింహారెడ్డి, గూళ్ల ప్రభాకర్, మోటూరి రవి, కొంగరి రాజు, బొట్ల పవన్, కంసాని అశోక్, బొడ్డుపెల్లి అజయ్, పొనుగోటి అజయ్, ధాన్యం రంగనాథస్వామి, ఎం ప్రభాకర్ పాల్గొన్నారు.

## వరంగల్‌లో విరాళాల సేకరణ

పోచమ్మమైదాన్/గిర్మాజీపేట, ఆగస్టు 8: కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు సీపీఎం కాశీబుగ్గ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పోచమ్మమైదాన్, దేశాయిపేట, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లో తిరుగుతూ స్థానికుల నుంచి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహ్మద్ బషీర్ హైమద్, మోసంగి వెంకన్న, దామెర రమేశ్, అక్మల్ పాషా, మేకల లింగయ్య, శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు. అలాగే, వయనాడ్ వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ తమకు తోచిన సాయం అందించాలని సీఐటీయూ నేతలు పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి నాయకులతో కలిసి మండిబజార్‌లో విరాళాలు సేకరించారు.

## విలేకరిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు

ఖిలావరంగల్, ఆగస్టు 8: విలేకరిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ సీఐ పీ మల్లయ్య తెలిపారు. మామునూరుకు చెందిన దండు చిట్టిబాబు ఓ పత్రిక (నమస్తే తెలంగాణ కాదు)లో విలేకరిగా పని చేస్తున్నాడు. అతడు ఓ ఆర్టికల్ రాసినందుకు గురువారం డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు సాంబమూర్తితోపాటు మరో వ్యక్తి శంభునిపేటలో అడ్డగించారు. వార్త ఎందుకు రాశావంటూ చిట్టిబాబు సెల్‌ఫోన్‌తోపాటు బైక్ కీని లాక్కొని దాడి చేశారు. దీంతో అతడు మిల్స్‌కాలనీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. పలు సెక్షన్ల కింద వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

## 'రోడ్డు స్థలాన్ని కాపాడాలి'


ఆక్రమణకు గురైన రోడ్డు స్థలం

చెన్నారావుపేట, ఆగస్టు 8: ఆక్రమణకు గురవుతున్న రోడ్డు స్థలాన్ని కాపాడాలని చెరువుకొమ్ము తండా వాసులు కోరుతున్నారు. తండా శివారులోని అమృతండాకు చెందిన భూక్యా వశ్రాం చెరువుకొమ్ముతండా-బోడ మాణిక్యంతండాకు వెళ్లే ప్రధాన రహదారిని ఆక్రమించాడని తండావాసులు ఆరోపిస్తున్నారు. తన పొలం రోడ్డు పక్కనే ఉండడంతో స్థలాన్ని పొలంలో కలుపుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారిని కాపాడాలని కోరుతున్నారు.

## ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత పాటించాలి

పర్వతగిరి, ఆగస్టు 8: మండలకేంద్రంలోని కేజీబీవీలో హెడ్ కుక్, స్వీపర్ కమ్ శానిటరీ వర్కర్, నైట్ వాచ్‌మెన్ పోస్టుల భర్తీలో పారదర్శకత పాటించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ మండల పక్షాన తహసీల్దార్ వెంకటస్వామికి గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యులు గారె జయరాజ్, జెరిపోతుల వంశీకృష్ణ మాట్లాడుతూ గతంలో చేపట్టిన నియామకాల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ దఫా రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చూడాలని, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయాలని కోరారు. వారి వెంట రాహుల్ ఉన్నారు.

## నేతన్న బీమా పథకానికి దరఖాస్తులు

పోచమ్మమైదాన్, ఆగస్టు 8: నేతన్న బీమా పథకానికి జిల్లాలోని చేనేత కార్మికులు ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు జి.రాఘవరావు తెలిపారు. నేత కార్మికుడు ఏదైనా కారణాల వల్ల మరణిస్తే బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందుతుందని పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వరకు అర్హులని, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్, నామినీ ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులను వరంగల్ చేనేత కార్యాలయంలో అందించాలని సూచించారు.

## 'సదస్సును జయప్రదం చేయాలి'

ఖిలావరంగల్, ఆగస్టు 8: హైదరాబాద్‌లో రేపు, ఎల్లుండి జరుగనున్న ఆదివాసి హక్కుల సదస్సును జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు పిలుపునిచ్చారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరుగనున్న ఈ సదస్సుకు వేదిక కోఆర్డినేటర్ ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

## నాలా పనులను వేగంగా పూర్తి చేయాలి

వరంగల్, ఆగస్టు 8 : నయీంనగర్ నాలా విస్తరణ, నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గురువారం నాలా పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 9న నాలా ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలని, ఈనెల 20వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. సైడ్‌వాల్ నిర్మాణ పనులను మరింత వేగంగా చేయాలని, బయటి పైప్‌లను బ్రిడ్జి కింది నుంచి అనుసంధానం చేయాలన్నారు. బల్దియా ఇన్‌చార్జి ఎస్ఈ రాజయ్య, సిటీ ప్లానర్ శైలజ, నేషనల్ హైవే ఈఈ మనోహర్, డీఈ శ్యామ్ మోహన్‌రెడ్డి, ఏఈ హరికుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## అడుగుకో గుంత..!


రైల్వే అండర్ బ్రిడ్జి-శివనగర్ రోడ్డులో ఏర్పడిన గుంతలు

ఖిలావరంగల్, ఆగస్టు 8: అడుగుకో గుంతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రైల్వేస్టేషన్ శివనగర్ వైపు వరకు ఉన్న సీసీరోడ్డుపై గుంతలు పడి అధ్వానంగా తయారైంది. శివనగర్ వైపు వచ్చే ప్రయాణికులు, ఉదయం స్కూళ్లకు, ఉద్యోగాల కోసం వెళ్లే ప్రజలు గుంతలు నానా అవస్థలు పడుతున్నారు.

## అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

వరంగల్, ఆగస్టు 8: బల్దియా అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ నుంచి ఆయన గ్రేటర్ వరంగల్‌కు వచ్చారు. అలాగే, డిప్యూటీ సిటీ ప్లానర్‌గా రవీంద్ర రాధాకర్ బాధ్యతలు చేపట్టారు.

## రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?


నల్లబెల్లి: నడవడానికే కష్టంగా ఉన్న ఆసరవెల్లి ప్రధాన రహదారి


ఖానాపురం: కొడ్తిమాట్‌తండాలో బురదమయంగా మారిన రోడ్డు

ఖానాపురం, ఆగస్టు 8: ఇటీవల కురిసిన వర్షాలకు కొడ్తిమాట్‌తండాలో అంతర్గత రోడ్లన్నీ బురదమయంగా మారాయి. వీధులన్నీ చిన్నపాటి వర్షాలకే చిత్తడిగా మారుతున్నాయని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

**ఏజెన్సీ గ్రామాల్లో మరీ అధ్వానం**

నల్లబెల్లి: వానకాలంలో రోడ్లను చూసి ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేడెపల్లి మీదుగా ఆసరవెల్లి, కొండాపూర్ ఏజెన్సీ గ్రామాలకు వెళ్లే ప్రధాన తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గుంతలుగా మారి బురదమయమైంది. కాలినడకన కూడా వెళ్లడం కష్టంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మరమ్మతులు వేసే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నరకయాతనను పడుతున్నామని వాహనదారులు అంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

## వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, ఆగస్టు 8: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో తొమ్మిది మందికి గురువారం వరంగల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. 9 మందికి రూ.15వేల జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఐదుగురికి రూ.4,500 జరిమానా విధించినట్లు సీఐ వెల్లడించారు.

**ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్‌కు రూ. వెయ్యి**

చెన్నారావుపేట: తిమ్మరాయిన్‌పహాడ్‌లో రోడ్లకు నష్టం కలిగిస్తున్న ట్రాక్టర్ ఓనర్ ధరావత్ రమేశ్, డ్రైవర్ సురేశ్‌కు గ్రామ పంచాయతీ అధికారులు ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో శ్రీధర్‌రాజు ఆధ్వర్యంలో గురువారం రూ.వెయ్యి జరిమానా విధించారు. ఇనుప చక్రాలతో ట్రాక్టర్లు తిరగడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయని వారు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని వారు ట్రాక్టర్ డ్రైవర్లను హెచ్చరించారు.

## నూతన గ్రామ పంచాయతీగా టీకేతండా

### కేసీఆర్, ఎర్రబెల్లి చిత్రపటానికి పాలాభిషేకం

రాయపర్తి, ఆగస్టు 8: మండలంలోని తిర్మలాయపల్లి పరిధి తెట్టెకుంటతండాను రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీగా గుర్తిస్తూ గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్, ఎంపీవో కూచన ప్రకాశ్ తెలిపారు. ఈ సందర్భంగా తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. తండాలను జీపీలుగా ఏర్పాటు చేయించిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు జినుగు అనిమిరెడ్డి, గజవెల్లి అనంతప్రసాద్, గుడి మైబురెడ్డి, గుడి యుగేంధర్‌రెడ్డి, వశపాక కుమారస్వామి, వశపాక మారయ్య, దొంతరబోయిన యాదగిరి, గజవెల్లి రాజు, యాకయ్య పాల్గొన్నారు.


కేసీఆర్, ఎర్రబెల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, తండావాసులు

## సార్వత్రిక విద్య ఎంతో సులభమైనది

గిర్మాజీపేట, ఆగస్టు 8: సార్వత్రిక విద్య ఎంతో సులభమైనదని డీఈవో వాసంతి అన్నారు. తన కార్యాలయంలో ఓపెన్‌టెన్త్, ఇంటర్ కోర్సులకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. పేదరికంతో చదువుకోలేని వారు, పనిచేసుకుంటూనే చదువు కొనసాగించేందుకు ఓపెన్‌టెన్త్, ఇంటర్ కోర్సులు ఉపకరిస్తాయన్నారు. ఓపెన్ టెన్త్ కోసం ప్రవేశరుసుం జనరల్ కేటగిరీ వారికి రూ.1,550, ఇంటర్‌కు రూ.1800, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు, మాజీ సైనికుల పిల్లలకు రూ.1,150, ఇంటర్‌లో రూ.1500 తోపాటు ఆన్‌లైన్ చార్జీలు అదనంగా చెల్లించాలని సూచించారు. సెప్టెంబర్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్‌స్కూల్ కో ఆర్డినేటర్ శంకర్‌రావు, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, జీసీడీవో ఫ్లోరెన్స్, నెక్కొండ ఎంఈవో రత్నమాల, డీఈవో సీసీ ఎస్‌బీ శ్రీనివాస్, అవినాశ్ పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో వాసంతి, అధికారులు

## 'హామీలను వెంటనే అమలు చేయాలి'

ఖిలావరంగల్, ఆగస్టు 8: కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ వరంగల్ కమిటీ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈనెల 15లోగా ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకులు, కార్యాలయాల్లో తప్పులను సరిచేసి బేషరతుగా రుణమాఫీ చేయాలని కోరారు.

## మాజీ కౌన్సిలర్ మృతి


సమ్మయ్య(ఫైల్)

కరీమాబాద్, ఆగస్టు 8: అండర్ రైల్వేగేట్ ప్రాంతానికి చెందిన మాజీ కౌన్సిలర్, మున్నూరుకాపు సంఘం నాయకుడు, దసరా ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు వంచనగిరి సమ్మయ్య(70) గురువారం మరణించారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కరీమాబాద్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచాడు. పలువురు నివాళులర్పించారు.

## గుడుంబా పట్టివేత

గీసుగొండ, ఆగస్టు 8: వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాకలో గురువారం 10 లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు. గండ్రకోట విజయపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## బుక్‌స్టాల్‌లో చోరీ

ఖిలావరంగల్, ఆగస్టు 8: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి ఖిలావరంగల్ వై జంక్షన్ సమీపంలోని ఓ బుక్‌స్టాల్‌లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. మిల్స్‌కాలనీ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ బుక్‌స్టాల్‌లో గుర్తు తెలియని వ్యక్తి తాళం పగులగొట్టి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 1.90 లక్షల నగదును అపహరించాడు. అలాగే, పక్కనే ఉన్న కిరాణా షాపు తాళం పగులగొట్టి చిల్లర డబ్బులు తీసుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ సీఐ పీ మల్లయ్య తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలలో..**

గీసుగొండ, ఆగస్టు 8: శాయంపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతం చేసినట్లు హెచ్‌ఎం సంపత్‌రావు గురువారం తెలిపారు. పాఠశాలలోని వంటగది తాళం పగులగొట్టి అందులోని 34 కిలోల బియ్యంతోపాటు సరుకులు, వంట పాత్రలను ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ బాబులాల్ తెలిపారు.

## డీఎఫ్‌వో బాధ్యతల స్వీకరణ

మట్టెవాడ, ఆగస్టు 8: వరంగల్ అగ్నిమాపక ప్రధాన అధికారి సతీశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన డీఎఫ్‌వో భగవాన్‌రెడ్డి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సతీశ్ విధుల్లో చేరారు. డీఎఫ్‌వోను అగ్నిమాపక అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★ I, MD KHAJA SHAMSUDDIN S/o Md Khaja Moinuddin R/o H.No. 2-7-848, Alipura, Subedari, Hanamkonda, Hanumakonda Dist., T.S. In my daughter's Passport my Name has been wrongly mentioned as MOHAMMED KHAJA SHAMSHUDDIN GULRAIZ instead of MD KHAJA SHAMSUDDIN.

NTW-000

**CHANGE OF NAME**

★I, the undersigned MUNDADA TARA (New name) previously called TARAKUMARI MUNDADA (Old Name), W/o SRINIVAS MUNDADA R/o. H.No: 8-4-90, Sri Krishna Colony, Station Road, Warangal district-506002, T.S. Solemnly declare.

NTW-17189

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

## జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నర్సంపేటరూరల్, ఆగస్టు 8: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి కోరె కుమారస్వామి డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) పిలుపు మేరకు గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు ఒకరోజు సమ్మె నిర్వహించారు. కార్మికులకు రూ. 5 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలని, పీఆర్సీలో అవకాశం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి బోల్ల పరశురాములు, వేల్పుల రవి, పద్మ, రవి, రాంబాబు, లత, సదానందం, కొమురయ్య పాల్గొన్నారు.

**జీపీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి**

ఖానాపురం: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని జీపీ సిబ్బంది మండల కమిటీ అధ్యక్షుడు ఉస్మాన్‌పాషా డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఒకరోజు దీక్ష నిర్వహించారు. జీపీ సిబ్బంది చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 51ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో వీరన్న, భిక్షపతి, విజయ్, వెంకటమ్మ, దర్శి, సాంబయ్య, రషీద్, మోహన్, కనకయ్య పాల్గొన్నారు.

**పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి**

నర్సంపేట/పర్వతగిరి: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు ఈదునూరి యాకయ్య, రాష్ట్ర కార్యదర్శి ఆరెపెల్లి బాబు డిమాండ్ చేశారు. నర్సంపేటలో పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాదాసి సారయ్య, గడ్డం సమ్మయ్య, చిలపాక యశోద, బొచ్చు భాస్కర్, ఉమ, మరియా, అలువాల రాజు, లక్ష్మి, అనిత, ఉపేంద్ర, కనకతార, సరిత, ఎలీషా, దేవేందర్, భరత్, యుగంధర్, మహేందర్, రమేశ్, నరేందర్, నవీన్, ఎల్లయ్య పాల్గొన్నారు. అలాగే, సీఐటీయూ పర్వతగిరి మండల అధ్యక్షుడు నకరకంటి రామచందర్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ ఉద్యోగులు ఒకరోజు సమ్మె చేశారు. యూనియన్ మండల అధ్యక్షుడు రామచందర్, ఉపాధ్యక్షుడు వడ్డే కుమార్, ప్రధాన కార్యదర్శి రజినిబాబు, కార్యదర్శి రాజసాగర్, గజ్జల మౌనిక, ప్రభాకర్, మహేందర్, కుమార్, యాకమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.



నర్సంపేటరూరల్: సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు


ఖానాపురం: దీక్ష చేస్తున్న జీపీ సిబ్బంది


నర్సంపేట: నిరసన తెలుపుతున్న కార్మికులు

## ఉరుస్తున్న తహసీల్దార్ కార్యాలయం

- ఊడుతున్న పెచ్చులు, తడుస్తున్న ఫైళ్లు
- ఇబ్బంది పడుతున్న అధికారులు, సందర్శకులు



శిథిలావస్థకు చేరిన భవనం

నర్సంపేటరూరల్, ఆగస్టు 8: నర్సంపేట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం వర్షానికి ఉరుస్తున్నది. సుమారు 40 ఏళ్ల క్రితం నర్సంపేటలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భవనం పాతది కావడంతో వర్షం పడినప్పుడల్లా ఉరుస్తున్నది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి స్లాబ్ పైభాగం పెచ్చులూడుతూ వర్షపు నీరు అధికారులు, సిబ్బందిపై పడుతోంది. అంతేకాకుండా విలువైన ఫైల్స్ తడుస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. అధికారులతోపాటు వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు, సర్టిఫికెట్ల కోసం వచ్చే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వర్తించాల్సి వస్తున్నదని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందిం చి నూతన భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


ఉరుస్తున్న భవనం పైకప్పు